పేదలే టార్గెట్



పలుకుబడి ఉన్నవారి పెట్రోల్ బంక్ వద్ద కాలువ, రోడ్డు ఏకమైనా పట్టించుకోకుండా వదిలేశారిలా..



డ్రైనేజీకి అవతల ఉన్న దుకాణాలను తొలగిస్తున్న సిబ్బంది



మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో కాలువ వెనుక ఉన్న పాకను కూడా ధ్వంసం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- మూడో రోజూ కొనసాగిన దుకాణాల తొలగింపు
- సామగ్రి తీసుకునే టైం కూడా ఇవ్వలేదని బాధితుల ఆవేదన
- పలుకుబడి ఉన్నవారికి మాత్రం రోజుల సమయం
- పేదలకో నిబంధన.. పెద్దలకు మరొకటా అంటూ ఆగ్రహం



అధికారుల పక్షపాత వైఖరిని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వెంకటరావు



ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న బడ్డీలను క్రేన్‌తో తరలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మధురవాడ: ఆపరేషన్ లంగ్స్ 2.0లో భాగంగా జీవీఎంసీ అధికారులు మధురవాడలో ఆక్రమణలు తొలగిస్తున్న తీరు పేదలే లక్ష్యంగా సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ జోన్-2 పరిధి మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ, పరిసర ప్రాంతాల్లో మూడురోజులుగా తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల బడ్డీలు తొలగిస్తున్నారు. అధికారులు రాజకీయ పలుకుబడి, ఆర్థిక అండ ఉన్నవారి పట్ల ఒక తీరుగా, పేదల పట్ల మరో తీరుగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

పేదల గుడిసెల తొలగింపు

మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ గాంధీ విగ్రహం, కృషి షాపింగ్ మాల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో బడ్డీలు, కాల్వలపై ఆక్రమణలను అధికారులు శనివారం రెండో వైపు తొలగించారు. కృషి షాపింగ్ మాల్, పెట్రోల్ బంక్ వైపు రోడ్డును ఆనుకుని ఉండి, వారి వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకున్నా.. టైల్స్ కాల్వలను మూసేసి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. రెండోవైపు మాత్రం కల్యాణ మండపం ఇరువైపులా బడ్డీల తొలగింపుతో పాటు రోడ్డు పక్కన సిమెంట్ వేసి ఉన్న భాగాలను కూడా ధ్వంసం చేశారు. కాల్వ వెనుక ఉన్న పేదల గుడిసెలు కూడా ధ్వంసం చేయడంతో వారు బోరున విలపించారు.

జీవీఎంసీ అధికారుల వివక్ష

తగరపువలస: తగరపువలసలో ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది వ్యాపారుల పట్ల వివక్ష చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. గత రెండు రోజులుగా మెయిన్‌రోడ్డులో తోపుడుబండ్లు, చిరు వ్యాపారులను భయపెట్టి పంపేసిన జీవీఎంసీ సిబ్బంది పెద్ద దుకాణాలు, వ్యాపారుల జోలికి మాత్రం వెళ్లకపోవడం వారి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. తాతా థియేటర్ దగ్గర నుంచి బంగ్లామెట్ట వరకు డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యాపారులకు మాత్రం మెల్లగా చెప్పి ఆక్రమణల తొలగింపు ఊసు లేకుండా పారిశుధ్య పనులు చేసుకోవడానికి మాత్రం మ్యాన్‌హోల్ పెట్టుకోవాలని బుజ్జగించారు.

56 దుకాణాల తొలగింపు

శనివారం చిట్టివలస ఈఎస్ఐ ఆసుపత్రిని ఆనుకుని ట్రాఫిక్‌కు ఏ మాత్రం ఇబ్బంది కలిగించని 56 మంది దుకాణదారులపై జులుం ప్రదర్శించారు. సర్వీస్ రోడ్డు, ఆ పక్కనే డ్రైనేజీల అవతల ఉన్న వీరిని బలవంతంగా ఖాళీ చేయించారు. భారీ వాహనాలు, క్రేన్‌లను తీసుకువచ్చి పోలీసుల సాయంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది బడ్డీలను చిట్టివలస బంతాట మైదానంలోకి తరలించారు. పాత బడ్డీలను తుక్కు చేశారు. ఆలయం, పబ్లిక్ టాయిలెట్ల కంటే వెనుక ఉన్న దుకాణాలను కూడా ఖాళీ చేయించి వారి ఆగ్రహానికి గురయ్యారు. ఈ 56 మంది చిరు వ్యాపారులనూ కోలుకోలేని దెబ్బ తీశారు. ఇటీవలే ఫ్రిడ్జ్‌లు, జిరాక్స్ యంత్రాలు, ప్యాచ్ వర్కులు తదితర పనుల కోసం రూ.లక్షలు వెచ్చించి కొన్న యంత్రాలు ఎక్కడ దాచుకోవాలో తెలియక వారంతా బాధ పడుతున్నారు.

డబ్బులు డిమాండ్ చేస్తున్న క్రేన్ ఆపరేటర్లు

పులిమీద పుట్రలా బడ్డీలను తొలగించినందుకు క్రేన్ ఆపరేటర్లు దుకాణదారుల నుంచి రూ.3వేలు వంతున డిమాండ్ చేశారు.

అధికారుల తీరు సరి కాదు



జీవీఎంసీ అధికారులు పేదల పట్ల ఒక విధంగా, పెద్దల పట్ల ఒకరకంగా వ్యవహరిస్తున్నారు. పేదలు బ్యాంకు అప్పులు, డైలీ ఫైనాన్స్‌లు తీసుకుని రోడ్డు పక్క వ్యాపారాలు చేసుకుంటున్నారు. వారికి సామగ్రి తీసుకునే టైం ఇవ్వడం లేదు. ఇది సరికాదు.

– డి. అప్పలరాజు, సీపీఎం నాయకుడు

పెద్దలకో న్యాయం.. పేదలకో న్యాయమా?



రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపులో అధికారుల తీరు పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయం అన్నట్లుగా ఉంది. ముఖ్యంగా సాగర్‌నగర్ ఏరియాలో ఓ షాపింగ్‌మాల్‌ను నామమాత్రంగా తొలగించారు. మధురవాడలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటున్నది డీ మార్ట్ ప్రాంతంలో. కానీ, దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇది సరికాదు.

– మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రైవేటు స్థలాల్లో బడ్డీలనూ ధ్వంసం చేశారు



జీవీఎంసీ అధికారులు ప్రైవేటు స్థలాల్లో పెట్టుకున్న తోపుడుబళ్లు కూడా విరగ్గొట్టి ధ్వంసం చేశారు. వీధి వ్యాపారులపై ఇలా దాడులు చేసి రోడ్డున పడేయడం అన్యాయం. 2014లో వీరికి లైసెన్సులు ఇచ్చారు. ఇప్పుడు వారే నోటీసు ఇవ్వకుండా రోడ్డుకు లాగేస్తున్నారు. వీధి వ్యాపారుల జోనల్ కమిటీ సభ్యుడినైన నేను అడిగినా సమాధానం చెప్పలేదు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలి. లేదంటే దీనిపై ఆందోళన చేస్తాం.

– తాతపూడి ప్రదీప్ కుమార్, బీజేపీ నాయకుడు

గంట టైం అడిగినా ఇవ్వలేదు



ఏళ్ల తరబడి రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఉదయం అధికారులు వచ్చి బడ్డీ తీసేస్తుంటే సామగ్రి తీసుకోవడానికి గంట టైం అడిగాను. కనీసం పట్టించుకోలేదు. డైలీ ఫైనాన్స్‌లు, బ్యాంకు అప్పులు దీని మీదనే కట్టాలి. మా పరిస్థితి ఏమిటి? మా కుటుంబం రోడ్డున పడింది.

– గీత, చిరు వ్యాపారి

చిన్న వ్యాపారులు చితికిపోతారు



అప్పులు చేసి కుటుంబాల పోషణకు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నాం. రోజుకు రూ.800 వరకు సంపాదించుకుంటున్నాం. కష్టాలు వస్తే అండగా ఉంటారని యూనియన్లకు చందాలు కూడా కట్టాం. ఈ రోజు జీవీఎంసీ అధికారులు 56 మంది చిరువ్యాపారుల పట్ల నిర్దయగా వ్యవహరించారు. ప్రత్యామ్నాయం చూపలేదు. మళ్లీ కోలుకోవడం కష్టం.

– కుంచం సురేష్, టైర్‌వర్క్స్

అడ్డం ఉన్నవారిని వదిలేశారు



వాస్తవానికి తగరపువలసలో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉన్నచోట్ల కాకుండా ఎలాంటి ఇబ్బంది లేని మమ్మల్ని జీవీఎంసీ అధికారులు రోడ్డుకు ఈడ్చారు. ఉదయం అకస్మాత్తుగా వచ్చి విద్యుత్ లైన్లు కట్ చేశారు. సామగ్రి తీసుకోకపోతే దుకాణాలు తుక్కుగా మారిపోతాయని హెచ్చరించారు. పెద్ద దుకాణాల జోలికి పోకుండా హెచ్చరించి వదిలేశారు.

– శెట్టి లోకేష్, జ్యూస్ షాపు

పేదలనే లక్ష్యంగా చేసుకున్నారు



అధికారులు ఆక్రమణ పేరుతో తొలగింపు అంతా పేదలే లక్ష్యంగా చేపడుతున్నారు. వుడా కాలనీలో బడా బ్రాంది షాపు వద్ద రోడ్డు పక్కనే ఉన్న పాన్‌షాపును బెల్ట్ షాపులా వాడుతున్నారు. దీనిపై మా కాలనీ అసోసియేషన్ తరపున అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పేదల గురించి ఎవరు ఫిర్యాదు చేశారని తొలగిస్తున్నారు?

– మగ్గూరి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు

క్లుప్తంగా

తీరంలో సేవా పర్వ్-2025



కార్యక్రమంలో పాల్గొన్న డీటీవో మాధవి

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో సేవా పర్వ్-2025 లో భాగంగా శనివారం ఉదయం బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. వలంటీర్లు, విద్యార్థులు, అధికారులు కలసి బీచ్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటకశాఖ అధికారి మాధవి మాట్లాడుతూ బీచ్‌ను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత వ్యాపారులతో పాటు పర్యాటకుల పైన ఉందన్నారు. చెత్తను, ఇతర వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని సూచించారు. బీచ్ పరిశుభ్రతపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యాటకులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ, ఎర్రమట్టి దిబ్బలు తీరాల వద్ద కూడా బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు.

రేవిడి పీహెచ్‌సీని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం

పద్మనాభం: మండలంలోని రేవిడి పీహెచ్‌సీని ప్రపంచ బ్యాంకు బృందం శనివారం సందర్శించింది. బృందం సభ్యులు డాక్టర్ వర్ష, డాక్టర్ భార్గవి, డాక్టర్ సరిత పీహెచ్‌సీలో రికార్డుల నిర్వహణ, ఓపీ తీరు తెన్నులను పరిశీలించారు.

దివీస్‌చే ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్ కిట్లు



ఆనందపురంలో సైన్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం మూడు మండలాలకు చెందిన 44 ప్రభుత్వ పాఠశాలలకు రూ.79.20 లక్షల విలువైన సైన్స్ కిట్లు అందించింది. ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీటిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయా పాఠశాలల యాజమాన్యాలకు అందించారు. కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, డీజీఎం జగదీష్, ఆనందపురం ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద, ఎంపీడీవో జానకి, ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారి పునర్నిర్మాణానికి భూమి పూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో అన్నవరం నుంచి చెరకుపల్లి అవంతి కళాశాల జాతీయరహదారి వరకు 8 కిలోమీటర్ల మేర రూ.6.18 కోట్లతో చేపట్టనున్న పునర్నిర్మించనున్న రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. చిప్పాడ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో రహదారుల శాఖ ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ సాంబశివరావు, దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, డీజీఎం జగదీష్ పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే శక్తి యాప్

భీమునిపట్నం: స్త్రీల భద్రత కోసం పోలీసులు ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్ఐ సుశీల మాట్లాడుతూ ఈ యాప్ వల్ల స్త్రీలు, ఆడపిల్లలకు ఎంతో భద్రత లభిస్తుందన్నారు. సమస్య వచ్చినప్పుడు తమను సంప్రదిస్తే, వెంటనే స్పందించి వారిని ఆదుకుంటామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

లాభాల బాటలో మధురవాడ పీఏసీఎస్



నూతన కమిటీని సత్కరిస్తున్న పెద్దలు, అధికారులు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.38.60లక్షలు లాభాలు ఆర్జించిందని సొసైటీ చైర్‌పర్సన్ పోతిన ప్రసాద్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం సంఘం ఆవరణలో 66వ మహాజన సభలో ఆయన మాట్లాడారు. 2025 మార్చి 31 నాటికి మొత్తంగా 3083 మంది సభ్యులు ఉన్నారన్నారు. 2025 నాటికి రు.4.11కోట్లు డిపాజిట్లు కలిగి, 3.28కోట్లు రుణాలు మంజూరు చేసినట్టు చెప్పారు. ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్ షాపు వల్ల నష్టాలు వస్తున్నందున దానిని ఆపివేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్ పోతిన ప్రసాద్‌ను, సొసైటీ డైరెక్టర్లు పోతిన మీనాక్షి, బైపిల్లి పైడిరాజును సత్కరించారు. కార్యక్రమంలో సీఈవో ఎం అప్పలరాజు, డీసీసీబీ మధురవాడ బ్రాంచ్ మేనేజర్ వెంకట అప్పారావు, ఎడ్యుకేషన్ అధికారి రమేష్‌బాబు, మాజీ ఉపాధ్యక్షుడు మరుపిళ్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హ్యాకథాన్ టెక్నోవా-2025

తగరపువలస: సంగివలస అనిట్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్ టెక్నోవా-2025 కోడింగ్ పోటీ శనివారం ముగిసింది. 654 మంది విద్యార్థులు హాజరై 12 గంటల పాటు జరిగిన కోడింగ్ చాలెంజ్‌లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఏయూ ప్రొఫెసర్ లలితా భాస్కరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు, సీఎస్ఈ విభాగాధిపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖరులు

భీమునిపట్నం: రిజిస్ట్రేషన్ల విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానాల వల్ల కలిగే ఇబ్బందులు, సమస్యలపై భీమిలిలో దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్ కార్యక్రమం రెండో రోజు శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త విధానాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవడంతో పాటు ఇతర సమస్యలు కూడా వస్తున్నాయన్నారు. దీన్ని వెంటనే మార్చి, అందరికీ అనువైన విధానాన్ని తీసుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేతా లక్ష్మి, సాయి శ్రీనివాస్, భాను ప్రకాశ్, అడిదం కిశోర్, కోట వాసు తదితరులు పాల్గొన్నారు. కాగా, వీరి పెన్‌డౌన్ వల్ల రెండు రోజులుగా ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14లో 19 కిలోల విభాగంలో ఆరో తరగతి విద్యార్థిని జ్ఞాన సరస్వతి, అండర్-17 35 కిలోల విభాగం పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని రావాడ గౌరి ఎంపికయ్యారు. గోపాలపట్నంలో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని, వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం



స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న రెవెన్యూ అధికారులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ పాత ఏఎంజీ విద్యా సంస్థ సమీపంలో, సర్వే నంబర్ 173లో ఒక ప్రైవేటు సంస్థ 11సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌నాయుడుకు విషయం తెలియడంతో, ఆయన అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వో రిజ్వాన్, సిబ్బంది అక్కడికి వెళ్లి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆవాసీయ విద్యాలయం పరిశీలన



సిబ్బందితో ఎస్ఎస్ఏ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ కల్పన

భీమునిపట్నం: భీమిలిలోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆవాసీయ విద్యాలయాన్ని రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ కల్పన శనివారం సాయంత్రం ఆకస్మికంగా పరిశీలించారు. ఇక్కడి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి ఇందులోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల వర్క్‌బుక్స్, నోట్ బుక్స్‌ను పరిశీలించారు. వారు ఎలా చదువుతున్నారు, ఇక్కడ సదుపాయాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాలయ ప్రత్యేక అధికారి బి.మంగపతిరావు, ప్రధానోపాధ్యాయిని మోహనరూప, వార్డెన్ పాలవెల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన

పద్మనాభం: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని జాతీయ ఫ్యాకల్టీ శిక్షకురాలు అల్లు నిహారిక సూచించారు. కృష్ణాపురంలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు సర్వైకల్ క్యాన్సర్‌పై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డబ్ల్యూహెచ్‌వో లెక్కల ప్రకారం మన దేశంలో ప్రతీ గంటకు తొమ్మిది మంది ఈ క్యాన్సర్‌తో మృతి చెందుతున్నారన్నారు. దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి ఈ వ్యాధి ఉందని తెలిపారు. ఈ వ్యాధి రాకుండా తొమ్మిది నుంచి 15ఏళ్ల లోపు బాలికలు రెండు డోస్‌లు, 15 నుంచి 26 ఏళ్ల లోపు వారు మూడు డోస్‌లు వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. బీజేపీ వైద్య విభాగం, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, గాయత్రి కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రూపాకుల రవి కుమార్, టి.నాగమణి, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల నిరసన

- తమకు న్యాయం చేయాలంటూ భారీ ఎత్తున ర్యాలీ
- సీఐటీయూ నాయకుల అరెస్టు-విడుదల



సీఐటీయూ నాయకుల అరెస్టును అడ్డుకుంటున్న చిరు వ్యాపారులు



దుకాణాల తొలగింపుపై నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు

పీఎం పాలెం: చిరు వ్యాపారుల తోపుడుబళ్లను బలవంతంగా ఖాళీ చేయించడంతో వారు పోరాటానికి దిగారు. బడుగులపై కూటమి ప్రభుత్వ వైఖరి ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని యథావిధిగా వ్యాపారం చేయనివ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. చిరు వ్యాపారుల పొట్ట కొట్టడం అన్యాయమంటూ వుడా రోడ్డు నుంచి కారు షెడ్ మీదుగా పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు కారుషెడ్ కూడలిలో మానవహారంగా ఏర్పడటానికి ప్రయత్నించగా పీఎం పాలెం పోలీసులు వారిని అడ్డుకున్నారు. సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజును అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. అరెస్టులపై చిరు వ్యాపారులు ఆందోళనకు దిగడంతో, అరెస్టు చేసిన వారిని పోలీసులు విడిచి పెట్టారు. తోపుడు బళ్ల వ్యాపారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపడతామని తెలిపారు. మిథిలాపురి వుడాకాలనీ పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది ప్రాంతాలకు చెందిన చిరు వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తగరపువలసలో నిరసన

తగరపువలస: తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపుపైవైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. వ్యాపారులకు మద్దతుగా సోమవారం జీవీఎంసీ, కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్టు సీపీఎం నాయకుడు ఎస్.అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని మంగరాజు, శిల్లా కరుణాకరరెడ్డి, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

108 సేవలపై అవగాహన

మహారాణిపేట: 108 అత్యవసర సేవలపై మధురవాడ అరిహంత్ జూనియర్ కాలేజీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు 108 నంబర్ ప్రాముఖ్యత, దానివల్ల లభించే సేవల గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఈ నంబర్‌కు కాల్ చేయాలని, ప్రథమంగా అత్యంత అత్యవసర కేసులను చూసుకుంటారని 108 జిల్లా మేనేజర్ సురేష్ తెలిపారు. 108 అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న పరికరాల గురించి వివరిస్తూ, వాటి వాడకంపై ప్రాక్టికల్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ కె.శిరీష, డైరెక్టర్లు రమేశ్ బిత్రా, డి. ఆనంద్ రెడ్డి, డీన్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం తప్పనిసరి

తగరపువలస: చిన్నారులకు తప్పనిసరిగా పోషకాహారం అందించాలని సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి సూచించారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయమ్మ సత్రం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తరచూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకుంటూ నూనె వస్తువులు తగ్గించుకోవాలన్నారు. చిన్నారులకు అందించవలసిన చిరుతిండ్లు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కనకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా సిబ్బంది



మొక్కలు నాటుతున్న సర్పంచ్ వెంకట నారాయణ

తగరపువలస: పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన ఏర్పడిన గ్లోబల్ వార్మింగ్, క్లైమేట్ చేంజ్ పరిస్థితులను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలు నాటాలని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి కోరారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర థీమ్ గ్రీన్ ఏపీలో భాగంగా విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. కళాశాల చుట్టూ ఆకులు, మట్టి సేకరించి మొక్కల పెంపకానికి కంపోస్ట్ తయారు చేయించారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమిలి మండలం శింగనబంధ పంచాయతీలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకట నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొని, మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. గాడు వెంకటప్పడు, గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పద్మనాభం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.విజయ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కె.ఆనందరావు, ఏవో ఎంపీఎస్ చలం, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ సత్యంనాయుడు పాల్గొన్నారు. రేవిడి పీహెచ్‌సీ ప్రాంగణంలో వైద్యాధికారి కె.లీలా ప్రసాద్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా సిబ్బంది ర్యాలీ

భీమునిపట్నం: స్వచ్ఛోత్సవ్ – స్వచ్ఛహిసేవా కార్యక్రమంలో భాగంగా భీమిలిలో శనివారం భీమిలి, చిట్టివలస తపాలా సిబ్బంది పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ శాఖ నార్త్ ఇన్‌స్పెక్టర్ జి.జగదీశ్వరరావు, భీమిలి, చిట్టివలస సబ్ పోస్ట్ మాస్టర్లు బోని చంద్రశేఖర్, ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.